క్లుప్తంగా

ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం

నరసరావుపేట టౌన్: రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. బాల్య వివాహాలు నిర్వహించటం నేరం అన్నారు. చదువుకోవటం బాలల ప్రాథమిక హక్కు అని తెలియజేశారు. టూటౌన్ సీఐ వీరేంద్రబాబు, పాఠశాల హెచ్ఎం ఎం.ప్రమీలారాణి, సిబ్బంది పాల్గొన్నారు. మొదట వివిధ జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.

మహిళలకు సమాన గౌరవం ఇవ్వాలి

వినుకొండ(నూజెండ్ల): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు డీఆర్డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో వినుకొండ రూరల్ మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో జెండర్ వివక్షకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మహిళలను సమాన గౌరవంగా చూడాలని, గృహహింసలను వ్యతిరేకించాలని, మహిళలపై దాడులను అరికట్టాలని అన్నారు. సీసీలు, వీఓలు, డ్వాక్రా సంఘాలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెన్నకేశవ ఆలయ జీర్ణోద్ధరణ పనులు

నాదెండ్ల: తూబాడు గ్రామంలో కొలువైయున్న భూ, నీలా సమేత శ్రీ చెన్నకేశవ స్వామి, ఆంజనేయస్వామి వార్ల దేవాలయ జీర్ణోద్ధరణ పనులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు దేవదాయ శాఖ ఈఓ తులసీదాస్ చెప్పారు. జీర్ణోద్ధరణ పనులకై దేవదాయ శాఖ రూ.కోటి నిధులు విడుదల చేసింది. సుమారు 250 ఏళ్ల క్రితం దేవతా మూర్తులను ఏర్పాటు చేసి ఆలయం నిర్మించారు. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరటంతో సోమవారం నుంచి మూడు రోజుల పాటూ కళాప్రకర్షణ కార్యక్రమం వేద మంత్రోచ్ఛారణలతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు సురభి జోసఫ్ కుమార్ అధ్యక్షతన క్రిస్మస్ స్టార్ వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాస్టర్ పత్రా ఫిలిప్ వాక్యపరిచర్య చేశారు. పాస్టరమ్మ రెవ.లిడియా ఫిలిప్ ఆధ్వర్యంలో సంఘ స్త్రీల సమాజం క్రిస్మస్ పాటలు ఆలపించారు. సంఘం సెక్రటరీ బేతం గాబ్రియేల్ మోజెస్, ట్రెజరర్ శ్యాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కాల్వ సుందరరాజు, జాయింట్ సెక్రటరీ న్యూటన్ ప్రసంగి, సంఘ పెద్దలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం జాతీయ రహదారి మార్గంలో బైకును కారు ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ టి.తిరుపతిరావు వివరాలు మేరకు అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు శ్రీశైలం నుంచి విజయవాడకు వెళుతుండగా మార్గమధ్యంలో కనమర్లపూడి గ్రామసమీపాన ఎస్సీ కాలనీ చర్చి ఎదుట అటు నుంచి గడ్డి మూటతో బైకుపై వస్తున్న బీసీ కాలనీ వాసి దుర్గారావును ఢీకొనటంతో కుడి కాలు విరిగిపోయింది. దీంతో స్థానికులు 108 అత్యవసర వాహనానికి ఫోన్ చేయగా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన హరిదాసు రామమోహనరావు, అరుణ దంపతులు రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళం చెక్కును ఈఓ టి.సుధాకరరెడ్డికి దాతలు అందించారు. త్వరలో ప్రారంభకానున్న ఆలయ పునర్నిర్మాణ పనులకు దాతల ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని ఈఓ కోరారు.

నేడు సీజీజీబీ బ్రాంచ్ ప్రారంభం

నాదెండ్ల: గణపవరం నాదెండ్ల డొంక రోడ్డులో సోమవారం చైతన్య గోదావరి గ్రామీణబ్యాంక్ 254వ శాఖను ప్రారంభిస్తున్నట్లు బ్రాంచి మేనేజర్ ఎస్.భరత్‌యాదవ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు చైర్మన్ టి.కామేశ్వరరావు, జనరల్ మేనేజర్లు డాక్టర్ బీవీ రమణరావు, పి.మారుతీరామ్, నరసరావుపేట రీజినల్ మేనేజర్ చిరుమామిళ్ల శ్రీనివాస్ పాల్గొంటారన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు సీఎం జగన్ కృషి

- ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి
- భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయసాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి చేస్తున్న మేలు ఇప్పటివరకు మరెవరూ చేయలేదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి పట్టణ నడిబొడ్డున ఉన్న భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. మంత్రివర్గంతో పాటు రాజ్యసభ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల్లో 50శాతంకు పైగా వారికి ఉన్నత స్థానం కల్పించారన్నారు. నా ఎస్సీలు, బీసీలు, మైనార్టీలు, ఎస్టీలు అంటూ సీఎం స్థానంలో ఉండి మాట్లాడుతున్న ఏకైక వ్యక్తి జగన్ ఒక్కరే అన్నారు. వారికి అన్నిరంగాల్లో సముచిత స్థానం కల్పించారని, వారిని పార్టీకి నాలుగుమూల స్తంభాలుగా ఏర్పాటు చేశారన్నారు. అందువల్ల మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. షేక్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆషాబేగం ఖాజావలి, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, మాదిగ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, వేముల శివ, గోగుల శంకర్, పంగులూరి విజయకుమార్, తలారి నాని తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులోని శాఖా గ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి జి.శ్రీనివాసరావు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: స్థానిక గ్రంథాలయ శాఖ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సీఆర్పీ రావూరి శివప్రసాదు, ఉపాధ్యాయులు శ్రీనివాససింగ్, చెన్నుబాబు, చెవల శ్రీరాములు పాల్గొన్నారు.

వినుకొండలో...



ఈపూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, గ్రామపెద్దలు



వినుకొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ(నూజెండ్ల): ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు కల్పించే విధంగా మన భారతదేశ రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని డాక్టర బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సారథ్యంలో రూపొందిన రాజ్యాంగం ప్రపంచంలోనే అనేక దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, పేద వర్గాలకు మేలు చేస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తూ, అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేస్తున్నారన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: రాజ్యాంగంపై అవగాహన ఉన్నప్పుడే వాటి ఫలాలు పొందగలమని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి అందించిన పవిత్ర రాజ్యాంగాన్ని చదవాలని అప్పుడే మన హక్కుల్ని సాధించుకోగలమని వివరించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, ఏఓ సాయి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: దేశానికి అత్యున్నత రాజ్యాంగం అందించిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌దని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి, ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అందించారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, ఎంపీపీ దేవినేని శంకరరావు, నాయకులు అన్నలదాసు బుల్లి, యడ్ల సురేష్, దాసరి మర్థు, ఎస్.వెంకయ్య, కొచ్చెర్ల కిషోర్, గుంజి వీరాంజనేయులు, రాచమంటి చింతారావు పాల్గొన్నారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: సువిశాల భారతదేశానికి ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించి దేశ ఉజ్వల భవితకు దోహదం చేసిన మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరం పాటుపడదామని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఈఓ ఆంజనేయులు, ఏపీఓ పుష్పరాజు, ఎంపీటీసీలు యల్లారావు, ఏసమ్మ, అంకమ్మ, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయంలో...

చిలకలూరిపేటటౌన్: దేశానికి రాజ్యాంగమే మూల స్తంభం అని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు చెప్పారు. ఆదివారం మండలంలోని మద్దిరాల గ్రామంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యున్నత శాసనం, పాలకులకు, పాలితులకు మధ్య సంబంధాన్ని క్రమబద్ధం చేసే నిబంధనావళి రాజ్యాంగమని చెప్పారు. రాజ్యాంగ రచనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి అనన్య సామాన్యమని కొనియాడారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజ్యాంగ విశిష్టత తెలుసుకోవాలి..

యడ్లపాడు: భవిష్యత్ తరాలకు రాజ్యాంగం యొక్క విశిష్టతను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు చెప్పారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ భారత దేశానికి అందించిన రాజ్యాంగం వల్లే అందరికీ సమాన హక్కులు పొందుతున్నారని తెలిపారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.



ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

నరసరావుపేట: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ చైర్మన్ కాల్వరవి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విగ్రహానికి పూల మాలలతో నివాళులు అర్పించారు.

అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి..

నరసరావుపేట: ప్రతి జిల్లా కేంద్రంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ, మాల మహానాడు, జన జాగృతి మహిళా మండలి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా బాపనయ్య నగర్ 12వ వార్డు, పల్నాడు రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. డాక్టర్ గోదా జాన్‌పాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

రాజ్యాంగం దేశానికి వెన్నెముకలాంటిది..

నరసరావుపేట: భారత రాజ్యాంగం దేశానికి వెన్నెముకవంటిదని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి (డీబీహెచ్‌పీఎస్) అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్‌కుమార్ అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం గడియార స్తంభం వద్ద భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ గడ్డం వెంకట్రావు నివాళులర్పించారు. ఎంపీపీ వెంకట్రావు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ వర్గాల ప్రజలకు హక్కులు, సామాజిక న్యాయం, రిజర్వేషన్ల కల్పన జరిగిందన్నారు.

ప్రభుత్వ మంచి పనులు విస్తృతంగా ప్రచారం చేయండి

- ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాన్ని నిలువరించండి
- సోషల్ మీడియా కార్యకర్తలకు సూచించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను వివిధ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రామిరెడ్డిపేటలోని సన్నిధి ఫంక్షన్ హాలులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఐటీడీపీ పేరుతో ప్రతిపక్ష టీడీపీ అనుకూల వర్గాలు ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు, నిర్ణయాలను విస్తృతంగా మీడియాలో ప్రచారం చేయాలని, అవి సామాన్య ప్రజలకు చేరువ కావాలని సూచించారు. సోషల్‌మీడియా ప్రాధాన్యత పెరిగిపోయిందన్నారు. టీడీపీ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత ఆ రంగంలో వారి కార్యకలాపాలు విస్తృతం చేశారన్నారు. దీనిని ఎదుర్కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మనస్పర్థలు పక్కన పెట్టి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందులో సోషల్ మీడియాకు కూడా బాధ్యత ఉందన్నారు. వచ్చే నాలుగు నెలలు చాలా ప్రాముఖ్యతమైన దినాలని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వచ్ఛాంధ్ర, మాదిగ సంక్షేమ కార్పొరేషన్ల డైరక్టర్లు ఎస్.సుజాతాపాల్, కందుల ఎజ్రా, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, జిల్లా కోశాధికారి ఎన్‌కే ఆంజనేయులు, రొంపిచర్ల మండల నాయకుడు పచ్చవ రవీంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు జి.అచ్యుతరావు, షేక్ కరిముల్లా, మెట్ల లింగారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సర్పంచ్ చింతా విజయ్‌కుమార్

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 20 కుటుంబాలకు చెందినవారు వైఎస్సార్ సీపీలోకి ఆదివారం చేరారు. ఈసందర్భంగా గ్రామసర్పంచ్ చింతా విజయ్‌కుమార్ సారథ్యంలో 20 కుటుంబాలకు వారందరికి వైఎస్సార్ సీపీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సర్పంచ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన నచ్చి ఇతర పార్టీల నుంచి అనేకమంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హయంలో గ్రామంలో గతంలో ఎన్నడూలేని అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ అల్లూరి వెంకట్రావు, రావినూతల ఏసుదాసు, రవితేజ, సుంకర పేరయ్య, కేసనపల్లి నాగేశ్వరరావు, జివ్వయ్య, కొండయ్య, కోటయ్య, దావీదు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర



నరసరావుపేట రూరల్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రను మండలంలోని లింగంగుంట్లలో ఆదివారం నిర్వహించారు. రాజ్యాంగం ఆమోదించబడిన రోజును పురస్కరించుకుని జిల్లాలో ఈ యాత్రను తలపెట్టారు. సంకల్ప యాత్ర ప్రారంభ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, సంయల్ప యాత్ర జిల్లా కో-ఆర్డినేటర్లు బెన్ని, విజయభాస్కరరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి అరుణ పాల్గొన్నారు. ప్రతిజ్ఞ అనంతరం దృశ్య శ్రవణ మాధ్యమికం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని ప్రసారం చేసారు. అనంతరం డ్రోన్‌ల వినియోగాన్నిన ప్రత్యక్షంగా తెలియజేశారు. పలువురు లబ్ధిదారులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందడం ద్వారా విజయవంతంగా వ్యవసాయం నిర్వహిస్తున్న రైతులు తమ అనుభవాలను వివరించారు. ఐసీడీఎస్, సేంద్రీయ వ్యవసాయం, ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాల స్టాల్స్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాతాల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం మాజీ సైనిక ఉద్యోగి ఉరియా ఏడుకొండలు, అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిని మత్రిబోయిన హరిప్రియ, సీనియర్ సిటిజన్ నంద్యాల సత్యనారాయణరెడ్డిని సత్కరించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కరపత్రాలు, క్యాలెండర్లు, బుక్లెట్లు అందజేశారు. ఏడీఏ మస్తానమ్మ, ఏఓ నరేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి కేవీ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అఖండ దీపారాధన, జ్వాలాతోరణం

మూలస్థానేశ్వరస్వామికి కార్తిక పౌర్ణమి ప్రత్యేక పూజలు



మూకుళ్లతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నాదెండ్ల: నాదెండ్లలో కొలువైయున్న గంగాపార్వతి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తిక పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని భక్తులు అఖండ దీపారాధన, జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో పాటూ గ్రామంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు హాజరై ఈ పర్వదినాన్ని కోలాహలంగా జరిపారు. సాయంత్రం 6 గంటల నుంచి మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించారు. మూకుళ్లలో ఒత్తులతో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం శిఖర గోపురం వద్ద అఖండాలు అమర్చారు. స్వామివారికి దీపాలంకరణ అనంతరం అదేదీపంతో జ్వాలాతోరణాన్ని అంటించారు. రాత్రి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లమోతు విజయసారధి, దేవాదాయశాఖ ఈఓ తులసీదాస్, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవంలో పాల్గొన్నారు.

శావల్యాపురం: మండలంలోని శావల్యాపురం, వేల్పూరు, పోట్లూరు, మతుకుమల్లి, కారుమంచి తదితర గ్రామాల్లో కార్తికపౌర్ణమి వేడుకలు ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివాలయాల్లో మహిళ భక్తులు దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ ఆలయ పూజారీ రావిపాటి సాయి భరత్ సారథ్యంలో శివుడుకి రుద్రాభిషేకాలు తదితర విశేష పూజలు వైభవంగా నిర్వహించారు.

మసీదుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రఫాని, మైనార్టీ నాయకులు

చిలకలూరిపేట: ప్రభుత్వం మసీదుల అభివృద్ధికి, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని అభివృద్ధి చేయాల్సిన మసీదుల గుర్తింపు ప్రక్రియ పూర్తి అయిన సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మైనార్టీ విభాగం నాయకులు ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మొత్తం 43 మసీదులను వివిధ అభివృద్ధి పనుల కోసం పరిశీలించినట్లు చెప్పారు. వీటికి అవసరమైన ప్రహరీలు, ఫ్లోరింగ్, ఇతర మరమ్మతులను త్వరలో ప్రారంభించేలా ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి ఇమామ్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మసీదుల పరిశీలన కార్యక్రమం పూర్తి కావచ్చిందని చెప్పారు. ఈ నెలాఖరు నాటికి వక్ఫ్ బోర్డు పరిధిలోని మసీదుల పరిశీలన కార్యక్రమం రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో పూర్తి చేసి డిసెంబర్‌లో ప్రభుత్వానికి నివేదిక పంపడం జరుగుతుందన్నారు. ఆ తదుపరి వెంటనే మసీదులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, మరమ్మతులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ముస్లిం సంక్షేమానికి ఇంతగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరని వెల్లడించారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ భక్షుమేస్త్రీ, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం పట్టణ, యడ్లపాడు, నాదెండ్ల మండలాల అధ్యక్షులు బేరింగ్ మౌలాలి, సయ్యద్ ముజేఫా, షేక్ జానీబాషా, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్‌ఆలీ పాల్గొన్నారు.

మహాశివుడికి 'కోటి దీపార్చన'



లింగారావుపాలెం శివాలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



లింగారావుపాలెం శివాలయంలో ప్రత్యేక అలంకరణ చేసిన ఉత్సవమూర్తులు

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెంలో గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆధ్యాత్మికత శోభిల్లింది. కార్తిక మాసంలోనే ప్రత్యేకమైన పౌర్ణమి సందర్భంగా ఆలయంలో కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని ధర్మకర్తలు ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో శివలింగం, స్వస్తిక్, ఓంకారం తదితర ఆకారాలతో రంగురంగుల పూలు పేర్చి అందులో ప్రమిదలు ఏర్పాటు చేసి దీపాలను వెలించారు. దేవాలయం మొత్తం రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో ఆలయం ప్రాంగణం, ప్రాకారాలు అంతటా వెలుగుమయం అయింది. అర్చకులు కోటి దీపార్చనతో పాటు ఆలయంలో శివలింగానికి వివిధ రకాల అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని రాత్రంతా జాగారం చేశారు.

■ ఉత్సాహభరితంగా నేషనల్ సైన్స్-2023 పరీక్ష

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం నేషనల్ సైన్స్ 2023 పరీక్ష ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో ఈ పరీక్ష నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆధ్వర్యంలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ విభాగాలలో పరీక్ష జరిగింది. ఈ పరీక్షను పరిశీలించిన ప్రిన్సిపాల్ బి.రవినాయక్ మాట్లాడుతూ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారం, సర్టిఫికేట్లతో పాటు ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌లో పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు.

■ రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నాదెండ్ల: గుంటూరు - కర్నూలు రాష్ట్రీయ రహదారిపై సాతులూరు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గొట్టిపాటి ఏసుబాబు గ్రామ దేవతల ఆలయంలో పూజాదికాలు నిర్వహిస్తుంటాడు. ఆదివారం కార్తీక పౌర్ణమి కావటంతో పూజా సామగ్రి తెచ్చుకునేందుకు తన స్కూటీపై వెళ్తుండగా గుంటూరు నుంచి శ్రీశైలం వెళ్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఢీకొంది. దీంతో ఏసుబాబుకు గాయాలు కావటంతో కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.